ఆటోవాలా.. తీరు మారేదెలా?



ఓ వైపు ఆర్టీసీ బస్సు.. ముందున స్పీడ్ బ్రేకర్.. ప్రమాదపుటంచున రామకృష్ణా రైతుబజారు వద్ద టన్నుల కొద్దీ సరకు తీసుకెళ్తున్న ఆటో



జ్ఞానాపురం నుంచి కంచరపాలెం వెళ్లే దారిలో పదుల సంఖ్యలో పాఠశాల పిల్లలను తీసుకెళ్తున్న ఆటో



జ్ఞానాపురం వద్ద పాఠశాల పిల్లలను వెనుక కూర్చోబెట్టి తీసుకెళ్తున్న దృశ్యం



జగదాంబ జంక్షన్ వద్ద ఓ వైపు ఆటో వెనుక పాఠశాల పిల్లలుండగా పాసింజర్లను ఎక్కిం చుకుంటున్న ఆటోవాలా

- ప్రమాదాలు సంభవిస్తున్నా మారని తీరు
- పరిమితికి మించి ప్రయాణి కుల తరలింపు
- ఓవర్‌లోడ్‌తో సరకు రవాణా

దాబాగార్డెన్స్ : జగదాంబ, పూర్ణామార్కెట్, ఆర్టీసీ కాంప్లెక్స్, కేజీహెచ్, లేపాక్షి, కాన్వెంట్ జంక్షన్ తదితర ప్రాంతాల్లో ఆటో ప్రయాణం ప్రమాదకరంగా మారుతోంది. బస్సు సౌకర్యం ఉన్నప్పటికీ చార్జీలు తక్కువ అనే ఆశతో స్కూల్ పిల్లలు, కార్మికులు ఆటోల్లో ప్రయాణం సాగిస్తున్నారు. వీరితోపాటు ఇక్కడ వ్యాపారం, విద్య, ఉద్యోగం కోసం వేల సంఖ్యలో ప్రజలు వస్తూ పోతుంటారు. పని ముగించుకుని ఇంటికి వేగంగా వెళ్లాలన్న ఆలోచనతో ఆటో ప్రయాణం చేస్తున్నారు. ఇదే అదునుగా భావించి ఆటోవాలాలు ప్రయాణికుల అవసరాలను అనువుగా తీసుకుని క్యాష్ చేసుకుంటున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా..

ఆటోల్లో నిబంధనల ప్రకారం నలుగురు లేదా ఐదుగురు మాత్రమే ప్రయాణించాలి. అయితే ఇక్కడ ఆటోవాలాలు మాత్రం ఆరుగురి కంటే ఎక్కువ మందినే ఎక్కించుకుంటున్నారు. డ్రైవర్ సీట్లో కూడా ప్రయాణికులను కూర్చోబెట్టుకుని ప్రమాదకరంగా ప్రయాణాలు సాగిస్తున్నారు. వెనుక సీటులో నలుగురైదుగురు.. ఆ వెనుక ముగ్గురు నలుగురిని కుక్కుతున్నారు. ఆటోస్టాండ్‌లో వరుస క్రమంలో పెట్టాలనే ఆలోచనతో అతివేగంగా ఆటోలు నడుపుతున్నారు. ప్రయాణికులు కూడా గమ్య స్థానాలకు త్వరగా చేరాలన్న ఉద్దేశంతో ప్రమాదకరమైనప్పటికీ ఆటో ప్రయాణానికే సిద్ధమవుతున్నారు.

పోలీసుల హెచ్చరికలు బేఖాతర్

పరిమితమైన ప్రయాణికులతోనే ఆటోలు నడపాలని పోలీసులు నిత్యం ఆటో డ్రైవర్లకు సూచిస్తున్నారు. ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నారు. అయినప్పటికీ వారి తీరు మారడం లేదు. నగర పరిధి దాటిన తర్వాత ప్రయాణికులను ఎక్కించుకుని తమ పని తాము చేసుకుపోతున్నారు. ముఖ్యంగా నగర శివార్ల నుంచి ఆస్పత్రులు (కేజీహెచ్, కలెక్టర్ కార్యాలయం వద్ద గల ప్రైవేట్ ఆస్పత్రులు), మార్కెట్లకు వచ్చే వారు అధిక సంఖ్యలో ఆటోలను ఆశ్రయిస్తున్నారు. టికెట్ సర్వీస్ కింద నగర శివార్ల నుంచి జగదాంబ, కలెక్టర్ కార్యాలయం, కేజీహెచ్‌తోపాటు వస్త్ర దుకాణాలు, పూర్ణామార్కెట్ తదితర ప్రాంతాలకు ఆటోలపై రావాడం, తిరిగి టికెట్ సర్వీస్‌ల కింద నగర శివార్లలో ఉన్న వారి స్వగృహాలకు ఆటోలపై గుంపులు గుంపులుగా వెళ్తున్నారు.

సరకు రవాణాలోనూ ఇష్టారాజ్యమే..

పాసింజర్ల పరిస్థితి దారుణంగా ఉంటే.. సరకు రవాణా చేసే వారు కూడా పాసింజర్ ఆటోల ద్వారా టన్నుల కొద్దీ సరకు రవాణా చేస్తున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందో తెలియదు గానీ ఆటో కార్మికుల్లో మార్పు మాత్రం రావడం లేదు.

గౌతు లచ్చన్న సేవలు స్ఫూర్తిదాయకం



లచ్చన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వాసుదేవరావు, తదితరులు

దాబాగార్డెన్స్ : గౌతు లచ్చన్న సేవలు స్ఫూర్తిదాయకమని విశాఖపట్నం జిల్లా శ్రీశయన కుల సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు తోట వాసుదేవరావు కొనియాడారు. స్వాతంత్య్రం కోసం బ్రిటీష్ పాలకులను ఎదురించి పోరాడిన సమరయోధుడని, బడుగు, బలహీన వర్గాలకు లచ్చన్న అందించిన సేవలు ఎనలేనివన్నారు. గౌతు లచ్చన్న 116వ జయంతి సందర్భంగా జడ్జి కోర్టు సమీపాన గల విగ్రహానికి శనివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వాసుదేవరావు మాట్లాడుతూ గౌతు లచ్చన్న జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని తాము ఎప్పటి నుంచో వేడుకుంటున్నామని, ప్రభుత్వం స్పందించి కార్యరూపంలోకి తెచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పలాస కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో ఆ జిల్లాకు లచ్చన్న పేరు పెట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మడ్డి ప్రసాద్, తోట శేఖర్, బొంగు సత్తిరాజు, గడ్డి తిరుపతిరావు, తోట హరికృష్ణ, జె.రమణ, కె.రవి, దొంపాక భాస్కర్, వెంకటరమణ, తోట హరిశంకర్, ఎం.చిట్టిబాబు, పైలా నాగేశ్వరరావు, జలుమూరి చిట్టిబాబు, ప్రసాద్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

మార్వాడీ కుటుంబానికి వాసుపల్లి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

దాబాగార్డెన్స్ : దక్షిణ నియోజకవర్గ పరిధి 38వ వార్డులో స్థానికంగా నివాసముంటున్న మార్వాడీ కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ అండగా నిలిచారు. కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న మార్వాడీ సుభద్ర ఇంటికి వాసుపల్లి శనివారం వెళ్లి పరామర్శించారు. వైద్య ఖర్చుల కోసం రూ.5 వేలు అందజేశారు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న ఆమె ఆస్పత్రికి వెళ్లేందుకు రవాణా ఖర్చులు, ఆర్థిక సాయం అందజేస్తానని వాసుపల్లి ఈ సందర్భంగా భరోసా కల్పించారు. కార్యక్రమంలో బీసీ సెల్ అధ్యక్షుడు సనపల రవీంద్రభరత్, పార్టీ నాయకులు ఆకుల శ్యామ్, వార్డు అధ్యక్షుడు గురజాపు రవి, చేపల నూకరాజు, అర్జున్ ప్రసాద్, కోసూరి కిరణ్, అనెమోల్, అయ్యప్ప, అమరదేవి, రాము, పెదగాడ బాబ్జి, కదిరి మహేష్, చేపల ప్రసాద్, రాజు, చిన్నికృష్ణ, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యులకు అప్పగింత



పెంటయ్యను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న సీఐ ఎర్రంనాయుడు

అల్లిపురం : పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు జ్యోతిర్గమయ కార్యక్రమంలో భాగంగా యాచకులను పునరావాస కేంద్రాలకు తరలించారు. భీమనగర్ పురుషుల నిరాశ్రయుల వసతి గృహంలో ఉన్న పిల్లి పెంటయ్య (68)ను శనివారం సాయంత్రం టూటౌన్ సీఐ వీవీసీఎం ఎర్రం నాయుడు కుటుంబ సభ్యులకు అప్పగించారు. కొన్ని రోజులుగా ఇల్లు విడిచి తిరుగుతున్న పెంటయ్యను గుర్తించి పోలీసులు ఇక్కడికి తీసుకొచ్చారు. పెంటయ్య వివరాలను సీఐ ఎర్రం నాయుడు ఆరా తీయగా... కంచరపాలెం ప్రాంతానికి చెందిన వాడిగా తెలుసుకుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించి అప్పగించారు. సీపీకి, సీఐకి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

దేవమాత తేరుకు ప్రత్యేక ప్రార్థనలు



దేవమాత తేరును దర్శించుకుంటున్న కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, శ్రీధర్

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పునీత పేతురు ప్రధాన దేవాలయంలో రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాష్, పారిస్ పాస్టిల్ కౌన్సిల్ (పీపీసీ) సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతున్న మరియమాత మోక్షారోపణ ఉత్సవాల్లో భాగంగా కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు కోడిగుడ్ల శ్రీధర్ శనివారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జ్ఞానాపురాన్ని, ప్రజలను రక్షించే దేవమాతకు ఎంతో ప్రాముఖ్యత ఉందని పూర్ణిమ పేర్కొన్నారు. దేవమాత తేరు ఉత్సవాలు, 125 వసంతాల వేడుకలను ఘనంగా నిర్వహించిన సెయింట్ పీటర్స్ కేథెడ్రల్ ఫాదర్లు, పీపీసీ కార్యవర్గ సభ్యులకు, సహకరించిన వార్డు ప్రజలకు ఆమె ప్రత్యేక అభినందనలు తెలిపారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

దాబాగార్డెన్స్: శ్రావణ మాసం, శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా నాట్యదీపిక కూచిపూడి అకాడమీ ఆధ్వర్యంలో శనివారం దుర్గాలమ్మ గుడిలో ప్రదర్శించిన నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. మూషిక వాహన.. కృష్ణ కోలాటం, రామయణ శబ్దం, అష్టలక్ష్మీ స్తోత్రం, వేడ కుందామా.. జయ జనవర్ధనే.. అదివో అల్లదివో.. కొండల్లో నెలకొన్న.. బ్రహ్మం ఒక్కటే.. పరబ్రహ్మం ఒక్కటే.. భావంలోన..వంటి పాటలకు చిన్నారులు నృత్యాలు చేశారు. నాట్యదీపిక కూచిపూడి అకాడమీ వ్యవస్థాపకురాలు, డైరెక్టర్ ఎల్.ఇంద్రాణి నరేంద్రరెడ్డి నేతృత్వంలో నిర్వహించిన ప్రదర్శనలో సాత్విక, ప్రణవి, దివ్యాషి, మోనిత, భూమి, మేఘన, లియాన్షి, లేఖ్య, ప్రకృతి, మేఘన పాల్గొన్నారు.

పౌరులందరికీ ఓటు హక్కు కల్పించాలి



నిరసన తెలుపుతున్న వామపక్ష పార్టీల నాయకులు, సభ్యులు

బీచ్‌రోడ్డు : దేశంలో ప్రజాస్వామ్యం, ప్రజల ఓటు హక్కు ఖూనీని కేంద్ర ప్రభుత్వం ఆపాలని డిమాండ్ చేస్తూ సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద శనివారం నిరసన ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే రెహమాన్ మాట్లాడుతూ బిహార్‌లో ఎన్నికల కమిషన్ 65 లక్షల ఓట్లు తొలగించడం ప్రజాస్వామ్యాన్ని హరించడమే అన్నారు. ఆధార్ కార్డు, ఓటర్ గుర్తింపు కార్డు చెల్లుబాటు కావని చెప్పడం, ఓటరే పౌరసత్వాన్ని నిరూపించుకోవాలని చెప్పడం దారుణమన్నారు. ఈసీ జారీ చేసిన ఓటర్ గుర్తింపు కార్డుతో దశాబ్దాలుగా ఓట్లు వేస్తున్న వారికి, ఇప్పుడు ఆ గుర్తింపు కార్డు చెల్లుబాటు కాదని ప్రకటించడం సరికాదన్నారు. ఈ అక్రమ నిబంధనలు రద్దు చేయాలని, పౌరులందరికీ ఓటు హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత రాజ్యాంగ వ్యవస్థలపై దాడి చేసి, దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. ఈడీ, సీబీఐలను రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించుకోవడం తీవ్రం చేసిందన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యం ప్రకారం దేశంలో అధ్యక్ష తరహా పాలనకు ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రజలంతా నడుము బిగించాలని విజ్ఞప్తి చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు పి.మణి, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కె.సత్యనారాయణ మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని, రాజ్యాంగ వ్యవస్థలను ధ్వంసం చేస్తున్న బీజేపీ పాలనను ప్రజలు తిరస్కరించాలని విజ్ఞప్తి చేశారు సీపీఎం జిల్లా కార్యదర్శి సభ్యుడు వి.కృష్ణారావు, ఆర్‌కేఎస్‌వీ కుమార్, బి.జగన్, బి.ఈశ్వరమ్మ, ఎం.సుబ్బారావు, సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు క్షేత్రపాల్ రెడ్డి, ఎం.మన్మధరావు, ఎం.రాంబాబు, కె.వనజాక్షి పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ రద్దు చేసే వరకు పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న రత్నాకర్

దాబాగార్డెన్స్ : ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణతో దళితుల ఐక్యతపై దేశ వ్యాప్తంగా రాజకీయ కుట్ర జరుగుతోందని, వర్గీకరణను రద్దు చేసే వరకు పోరాడుతామని రాక్స్ అండ్ మాల మహానాడు నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ రత్నాకర్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణతో దళితుల ఐక్యతపై దేశ వ్యాప్తంగా మోడీ, బీజేపీ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆరోపించారు. కుట్రలో భాగస్వామి చంద్రబాబునాయుడు మాల సామాజిక వర్గంపై పగబట్టి తొక్కేసే ప్రయత్నాన్ని తన భుజాన వేసుకుని నడిపిస్తున్నాడని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలు మాల సామాజిక వర్గంపై తెలుగు రాష్ట్రాల్లో కక్ష గట్టాయన్నారు. కులం, మతాన్ని రెచ్చగొట్టి, ఈ దేశాన్ని విభజించి, అమ్ముకునే పనిలో పడ్డారన్నారు. మోడీ, గుజరాతీ పరివారం మొత్తం ఎన్నికల కమిషన్‌ను పావుగా వాడుకుని దొంగతనంగా గెలిచి, పబ్బం గడుపుకుంటున్నారని ఆరోపించారు. దేశంలో అన్ని రాజ్యాంగ వ్యవస్థలను మోడీ నిర్వీర్యం చేశారని, దమ్ముంటే ఎన్నికలు రద్దు చేసి, బ్యాలెట్ పేపర్‌తో గెలిచి, సామర్థ్యాన్ని నిరూపించుకోవాలన్నారు. అపూర్వ సహోదరులు చంద్రబాబునాయుడు, రేవంత్‌రెడ్డి ఇద్దరూ మాల సామాజిక వర్గంపై సాధిస్తున్న కక్ష సాధింపు విషయంలో ఇకనైనా పునరాలోచించాలని సూచించారు. తెలుగు రాష్ట్రాల్లో జరిగిన ఎస్సీ వర్గీకరణ తాత్కాలికం మాత్రమేనని, పోరాటం కొనసాగుతుందన్నారు. సెప్టెంబర్ ఒకటి నుంచి ఉద్యమం గ్రామ గ్రామన చేపడతూ మరింత ఉధృతం చేస్తామన్నారు. సమావేశంలో గొల్ల ఈశ్వరరావు, మత్తి రత్నారావు, గొడుగు రాజు, సిమ్మాల దుర్గాప్రసాద్, శ్యామలరావు, నెల్లి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మోసగించడమే చంద్రబాబు నైజం



కుమ్మర వీధిలో మహిళకు చంద్రబాబు మోసాలను వివరిస్తున్న రమేష్



35వ వార్డులో కూటమి మోసాలపై ప్రచారం చేస్తున్న కనకరెడ్డి తదితరులు

అల్లిపురం: వైఎస్సార్‌సీపీ దక్షిణ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ సూచనల మేరకు 33వ వార్డులో పార్టీ వార్డు అధ్యక్షుడు ముత్తాబత్తుల రమేష్ ఆధ్వర్యంలో శనివారం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. 57 పోలింగ్ బూత్ పరిధిలోని కుమ్మర వీధి తదితర ప్రాంతాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు మోసాలపై ఇంటింటా ప్రచారం చేశారు. మోసగించడమే చంద్రబాబు నైజమని స్థానికులకు వివరించారు. సీనియర్ నాయకుడు పచ్చరపల్లి రాము, సౌత్ కల్చరల్ వింగ్ అధ్యక్షుడు సూర్యనాయుడు, జిల్లా మహిళా నాయకులు కొల్లు సత్యవతి, ధర్మ, నాయకులు పీవీఎస్ రెడ్డి, కృష్ణారెడ్డి, చోడీపల్లి శివకుమార్, పాల దామోదర్ రెడ్డి, తరుణ్‌కుమార్, ఎ.కొండలరావు పాల్గొన్నారు.

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డులో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు కనకరెడ్డి బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీపై ఇంటింటా ప్రచారం చేశారు. 85వ బూత్ సీహార్స్ జంక్షన్‌లో కార్యకర్తలతో కలిసి కూటమి ప్రభుత్వంలో చంద్రబాబు ఇచ్చిన మోసపూరిత హామీల గురించి ప్రజలకు వివరించారు. మూడేళ్ల తరువాత జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుని సంక్షేమ పథకాలు పొందాలని కనకరెడ్డి పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా సెక్రటరీ ఆదివిష్ణురెడ్డి, సౌత్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు సువర్ణరాజు, సౌత్ పబ్లిక్ వింగ్ ప్రెసిడెంట్ జీరు సూర్యానారాయణరెడ్డి, సౌత్ గ్రీవెన్స్‌సెల్ ప్రెసిడెంట్ మల్ల బుజ్జి, సిటీ వాణిజ్య విభాగం సెక్రటరీ గంగాధర్, రవి, శేఖర్, ప్రేమ్‌కుమార్ వై.రమణమ్మ, నగేష్ పాల్గొన్నారు.

శ్రీకృష్ణుడికి పట్టు వస్త్రాల సమర్పణ



పట్టువస్త్రాలు అందిస్తున్న దొడ్డి బాపూ ఆనంద్

దాబాగార్డెన్స్: జీవీఎంసీ 31వ వార్డులో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవకీ నంద ఫౌండేషన్ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ 31వ వార్డు అధ్యక్షుడు దొడ్డి బాపూ ఆనంద్ స్వామికి పట్టువస్త్రాలు సమర్పించారు. అలయ గౌరవ అధ్యక్షుడు బొట్ట అప్పారావు దంపతులు పట్టు వస్త్రాలు స్వీకరించి స్వామిని అలంకరించారు. కార్యక్రమంలో సారిపల్లి మహేష్, కర్రి లెనిన్, సారిపల్లి రాజు, ఒమ్మి గురుమూర్తి, ఒమ్మి చంద్రరావు, పెసల సత్యవతి, ధనలక్ష్మి, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా ముకుందా మురారీ

- వైభవంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు
- రాధాకృష్ణుల వేషధారణల్లో అలరించిన చిన్నారులు



గీతాభవన్‌లో శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు



కుసుమ హరనాథ ఆశ్రమంలో వేడుకలు



శివరామకృష్ణ దేవస్థానంలో విశేష అలంకరణలో రాధాకృష్ణులు



29వ వార్డులో శ్రీకృష్ణుడికి పూజలు చేస్తున్న పీతల వాసు, కనకల ఈశ్వర్



ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో ఉట్లు కొడుతున్న చిన్నారులు



స్వామి వివేకానంద సంస్థలో శ్రీకృష్ణ, గోపికల వేషధారణలో చిన్నారులు



శ్రీకృష్ణుడి విగ్రహంతో గౌరీ మహిళా మండలి సభ్యులు

దాబాగార్డెన్స్: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు శనివారం నియోజకవర్గంలో వైభవంగా జరిగాయి. వేకువజాము నుంచి కృష్ణ మందిరాలకు భక్తులు తరలివచ్చి ముకుందుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అల్లిపురం, కోటవీధి, చెంగల్రావు పేట, మహారాణిపేట, డాబాగార్డెన్స్, గొల్లలపాలెం తదితర ప్రాంతాల్లో సాయంత్రం ఉత్సాహంగా ఉట్లు కొట్టారు. పాతజైల్‌రోడ్డు కృష్ణుడి మందిరం వద్ద నిర్వహించిన వేడుకల్లో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.మహారాణిపేట జిల్లా పరిషత్ సమీపాన గల శ్రీకృష్ణ చైతన్య మఠంలో జన్మాష్టమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు.

- పాతనగరం స్వామి వివేకానంద సంస్థలో శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో పిల్లలు అలరించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్ చిన్నారులకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పిల్లలకు ఆధ్యాత్మిక, సంప్రదాయ పద్ధతులు నేర్పిస్తున్న సంస్థను కొనియాడారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, సభ్యులు పాల్గొన్నారు.
- డాబాగార్డెన్స్ కుసుమ హరనాథ ఆశ్రమంలో కమిటీ ఆధ్వర్యంలో రాధాకృష్ణ అభిన్న స్వరూపులు కుసుమ హరనాథుల దివ్యమూర్తులకు నూతన వస్త్రాలు, పూల మాలలతో అలంకరించి, బాల గోపాలుడికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ఆశ్రమ కమిటీ ప్రతినిధులు బీవీ బాబాజీ, ఆర్వీఎస్ రమేష్, ఎస్.అన్నాజీరావు, కె.మంగరాజు, ఆధ్యాత్మిక వేత్త ఎంవీ రాజశేఖర్, బి.శివ సీతారామ్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.
- పాతనగరం రాజప్పనాయుడు వీధి శ్రీగీతా భవనంలో గీతా ప్రచార సమితి ఆధ్వర్యంలో శ్రీకృష్ణ భగవానుడి ఉత్సవ మూర్తికి మంగళధ్వని వేదమంత్రాలతో పంచామృతాభిషేకం నిర్వహించారు. తులసీ దళాలతో అర్చన, ప్రత్యేక పూజలు, సాయంత్రం ఉట్టి కొట్టే సంబరం, శ్రీకృష్ణ వేషధారణ, ఉయ్యాల ఉత్సవం ఘనంగా నిర్వహించి దూప దీప నైవేద్యాలు మంత్రపుష్పం సమర్పించారు. కార్యక్రమాల్లో కార్యదర్శి ఎం.వనజాదేవి, కోశాధికారి జీవీఆర్ ప్రసాద్, జి.లక్ష్మీనరసింహ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.
- వన్‌టౌన్ ప్రాంతం ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో 12 ఏళ్లలోపు బాల బాలికలచే శ్రీకృష్ణాష్టమి వేడుకలు జరిపారు. ముద్దులొలికే గోపికలతో అల్లరి కృష్ణయ్య.. పేరిట ఉత్సవం నిర్వహించారు. చిన్నారులతో ఉట్టి కొట్టించారు. చిన్ని కృష్ణుడు, రాధ, గోపికలు వేషధారణ పోటీలు, చిన్నారి కృష్ణుల చిలిపి పనులు వంటి కార్యక్రమాలు ఉత్సాహ భరితంగా నిర్వహించారు.
- 29వ వార్డు వేంకటేశ్వర నగర్‌లో నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకల్లో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పీతల వాసు, పార్టీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి కనకల ఈశ్వర్, జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి గుమ్మడి చంద్రమౌళి తదితరులు శ్రీకృష్ణుడికి పూజలు జరిపారు. బొండాడ వెంకటరమణ, పైబోడి శివ, గండివలస పెంటయ్య, నంద గోపాల్ యాదవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. 29వ వార్డులోని వేంకటేశ్వరనగర్, కలెక్టర్ ఆఫీస్ రావి దుర్గాగణపతి ఆలయం వద్ద, పందిమెట్ట యువత ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో జనసేన పార్టీ వార్డు నాయకుడు మన్యాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

అల్లిపురం: అల్లిపురం పరిసర ప్రాంతాల్లో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వెంకటేశ్వరమెట్ట, శ్రీ గౌరీ మహిళా మండలి సభ్యుల ఆధ్వర్యంలో తిరునామ దారులై జై శ్రీ కృష్ణ అంటూ శ్రీకృష్ణుని ప్రతిమతో వీధులలో తిరుగుతూ అలరించారు. శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఉంచి పూజలు, భజనలు చేపట్టారు. సాయంత్రం పలు ప్రాంతాల్లో ఉట్లు కొట్లారు. టూటౌన్ దరి శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో కొలువైన శ్రీకృష్ణుడి మూలవిరాట్టుకు ఆలయ అర్చకుడు భార్గవశర్మ ఆధ్వర్యంలో పంచామృతాభిషేకాలు చేశారు. స్వామిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనాలు కల్పించారు.



శ్రీకృష్ణ చైతన్య మఠంలో కృష్ణ భగవానుడి దర్శనానికి బారులు తీరిన భక్తులు



కృష్ణ చైతన్య మఠంలో భక్తి గీతాలు ఆలపిస్తున్న యువతులు



కృష్ణ చైతన్య మఠంలో గోపాలుడి ఊయల సేవలో భక్తులు

వాసుపల్లికి సత్కారం



వాసుపల్లి గణేష్‌కుమార్ సత్కార కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

దాబాగార్డెన్స్: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మాజీ ఎమ్మెల్యే, పార్టీ దక్షిణ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ నియమించిన పార్టీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి కనకల ఈశ్వర్ శనివారం ఆశీల్‌మెట్టలోని కార్యాలయంలో వాసుపల్లిని సత్కరించారు. వైఎస్ జగన్‌కు, వాసుపల్లికి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో 29వ వార్డు అధ్యక్షుడు పీతల వాసు, పార్టీ నాయకులు బెవర మహేష్, ఆరుగుల రాజ్‌కుమార్, అడపా శివ, గుమ్మడి చంద్రమౌళి, బొండాడ వెంకటరమణ, ఆకుల శ్యామ్‌కుమార్, పడాల సూర్యకుమార్, గొర్రెపాటి శివ, పైబోడి శివ, వేంకటేష్, సుబ్బారెడ్డి, లంకె మహేశ్వరి, పప్పు కమల, కోవెలకుంట్ల వరప్రసాద్, గొలగాని మధు, గండివలస పెంటయ్య, సనపల రవీంద్రభరత్, పల్లా దుర్గారావు, లండా రమణ, కంటుముచ్చు సాగర్, పిన్నింటి రాజారెడ్డి, సంపంగి సురేష్ తదితరులు పాల్గొన్నారు.



జాన్‌వెస్లీని సత్కరిస్తున్న కనకల ఈశ్వర్

జాన్‌వెస్లీకి సత్కారం

వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు బొల్లవరపు జాన్‌వెస్లీని శనివారం కనకల ఈశ్వర్ మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. పీతల వాసు, బెవర మహేష్, బొండాడ వెంకట్రావు, ఆరుగుల రాజ్‌కుమార్, గుమ్మడి చంద్రమౌళి, పడాల సూర్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.